క్లుప్తంగా

అందుబాటులో పోటీ పరీక్షల పుస్తకాలు



పోటీ పరీక్షల పుస్తకాలను ఆవిష్కరిస్తున్న కుమార్ రాజా

నరసన్నపేట: జిల్లాలోని శాఖా గ్రంథాలయాల్లో నిరుద్యోగ యువత వినియోగానికి వీలుగా వివిధ రకాలైన కాంపిటేటివ్ పుస్తకాలు అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా గ్రంథాలయ శాఖ కార్యదర్శి బి.కుమార్‌రాజా అన్నారు. ఆర్ఆర్‌బీ, ఎస్ఎస్ఈ పోటీ పరీక్షలకు చెందిన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నట్లు తెలిపారు. నరసన్నపేట శాఖా గ్రంథాలయాన్ని బుధవారం వార్షిక తనిఖీ చేపట్టారు. గురు రాఘవేంద్ర ఇన్‌స్టిట్యూట్ నుంచి వచ్చిన పోటీ పరీక్షల పుస్తకాలను ఆవిష్కరించారు. లైబ్రేరియన్ చాయ్‌రతన్ తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



డ్యాన్స్ చేస్తున్న విద్యార్థినులు

నరసన్నపేట: మండలంలోని ఉర్లాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్లస్ టూ తరగతులకు చెందిన విద్యార్థులు బుధవారం ఫ్రెషర్స్ డే నిర్వహించారు. విద్యార్థులు పలు సాంస్కృతిక కార్యక్రమాలు, నృత్యాలు చేసి ఆకట్టుకున్నారు. హెచ్ఎం హర్షవర్ధన్ శర్మ మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలని, చదువుపై దృష్టి పెట్టాలన్నారు. తల్లిదండ్రులకు, గ్రామానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. ఉర్లాం ప్రాంతం విద్యార్థినులందరూ ప్లస్ టూ తరగతుల్లో చేరాలని కోరారు. పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పెట్టుబడి సాయం అందించాలి



వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతులు

జలుమూరు: కౌలు రైతులకు పెట్టుబడి సాయం రూ.20 వేలు అందించాలని జిల్లా కౌలు రైతుల సంఘ నాయకులు డిమాండ్ చేశారు. మండల పరిధిలోని అంధవరం సచివాలయంలో కార్యదర్శికి మండల శాఖ అధ్యక్షుడు కె.కొండయ్యకు బుధవారం వినతిపత్రం అందించారు. వర్షాలు, వరదలు, తుఫాన్‌కు నష్టపోయిన రైతులకు బీమా పరిహారం ఇవ్వాలన్నారు. సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలని, జీడి పంటకు మద్దతు ధర ప్రకటించాలన్నారు. తిత్లీ తుఫాన్‌లో నష్టపోయిన జీడి, కొబ్బరి రైతులకు ఇప్పటివరకు పరిహారం అందించలేదని, వారికి వెంటనే పరిహారం అందించాలన్నారు. మల్లేశ్వరరావు, జగదీశ్వరరావు, రాంబాబు, దానయ్య తదితరులు పాల్గొన్నారు.

సంతాపం..



ప్రదీప్ (ఫైల్)

పాతపట్నం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో టైపిస్టుగా పనిచేస్తున్న తేజోమూర్తిల ప్రదీప్ (42) అనారోగ్యం కారణంగా పాతపట్నం సీహెచ్‌సీలో చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందినట్లు ఎంపీడీఓ పి.జయంత్ ప్రసాద్ తెలిపారు. ఈయన పాతపట్నం టీచర్స్ కాలనీ ఉంటున్నారు. భార్య చందన, కుమారుడు, కుమార్తె ఉన్నారు. ఈయన స్వగ్రామం కొటబొమ్మళి. ఈయన మృతి పట్ల ఎంపీడీఓ, కార్యాలయ సిబ్బంది సంతాపం తెలిపారు.

14న లోక్ అదాలత్

కొత్తూరు: ఈ నెల 14 తేదీన జాతీయ లోక్ అదాలత్ నిర్వహిస్తున్నందున కోర్టులో పెండింగ్‌లో ఉన్న పలు కేసుల్లో కక్షదారులు సద్వినియోగం చేసుకోవాలని స్థానిక జూనియర్ సివిల్ జడ్జి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎస్.మణి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాజీకి లోబడి ఉన్న కేసుల్లో ఉన్న కక్షదారులను పోలీస్‌లు పిలిపించి రాజీ ప్రయత్నాలు చేయాలన్నారు. సివిల్, క్రిమినల్ కేసుల్లో రాజీపడటం వల్ల కలిగే ప్రయోజనాలను కక్షదారులకు పోలీస్‌లు వివరించాలన్నారు. కొత్తూరు, హిరమండలం, బత్తిలి పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న కేసులను రాజీ చేయాలన్నారు.

వర్షం పడితే.. చదువు అంతే..!



తరగతి గదిని శుభ్రం చేస్తున్న దృశ్యం

పొందూరు: మండలంలోని లచ్చయ్యపేట పాఠశాలలో చిన్నపాటి వర్షానికే గదులన్నీ కారుతున్నాయి. పైకప్పు నుంచి వర్షం నీరు చిమ్ముతూ పాఠశాల గదుల్లోకి చేరుతుంది. విద్యార్థులు కూర్చునేందుకు సైతం ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు హెచ్ఎం గండెం రామారావు, సిబ్బంది పాఠాలు బోధించడంలో బుధవారం తీవ్ర ఇబ్బంది పడ్డారు.

గోతులమయం

- ఇటీవల కురిసిన వర్షాలతో అధ్వానంగా మారిన రోడ్లు
- రహదారులపై నుంచి వరదనీటి ప్రవాహం
- రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు



చెరువును తలపించేలా ఏబీ రోడ్డు నుంచి కొమ్మువలస వెళ్లే రోడ్డు



బొర్రంపేట వద్ద గోతులమయంగా మారిన అలికాం-బత్తిలి ప్రధాన రోడ్డు

ఇటీవల కురిసిన వర్షాలతో ఎల్.ఎన్.పేట ప్రధాన రహదారితో పాటు పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. రోడ్లపై నుంచి వరదనీరు ప్రవహించటంతో రాళ్లుతేలి రాకపోయకలకు అంతరాయం కలిగిస్తున్నాయి. మండలం నుంచి కొత్తూరు, బత్తిలి, హిరమండలం, సరుబుజ్జిలి, అమదాలవలస, శ్రీకాకుళం జిల్లా కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి అలికాం–బత్తిలి (ఏబీ) రోడ్డుతో పాటు గ్రామీణ రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఏబీ రోడ్డు నుంచి ముంగెన్నపాడు, సిద్ధాంతం, కొమ్మువలస, గొట్టిపల్లి, బొత్తాడసింగి, జాడుపేట గ్రామాలకు వెళ్లే రహదారుల్లో రాళ్లు తేలాయి. లక్ష్మీనర్సుపేట రోడ్డు నుంచి బసవరాజుపేట, దొంకలబడవంజ నుంచి కొత్తబలేరు గ్రామాలకు వెళ్లే రోడ్లు గొతులమయంగా దర్శనమిస్తున్నాయి.

– ఎల్.ఎన్.పేట



అధ్వానంగా ఉన్న బొత్తాడసింగి రోడ్డు



రాళ్లు తేలిన సిద్ధాంతం రోడ్డు



ఏబీ రోడ్డులో వరదనీరు ప్రవహించటంతో ఏర్పడిన గోతులు

సహాయక చర్యల్లో.. ప్రభుత్వం వైఫల్యం

- కావాలనే బుడమేరు వరద ప్రవాహన్ని విజయవాడ వైపు మళ్లింపు
- మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం



ఆమదాలవలస: తుఫాన్ ప్రభావంతో విజయవాడ పరిసర ప్రాంతాల్లో ప్రజలకు ముప్పు ఉందని తెలిసినప్పటికీ వారిని అప్రమత్తం చేసే విషయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు స్వార్థపూరితంగా ఆలోచన చేశారని మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం అన్నారు. బుధవారం ఆయన సాక్షితో మాట్లాడుతూ తుఫాన్ ప్రభావంతో బుడమేరు నుంచి ప్రమాదం ఉందని తెలిసినప్పటికీ చంద్రబాబు తన ఇల్లు, ఏబీఎన్ రాధాకృష్ణ పవర్ ప్లాంట్ ఆస్తులను కాపాడుకునేదుకు ప్రజలు నివసిస్తున్న కాలనీల వైపు వరదనీటిని మళ్లించారని దుయ్యబట్టారు. ఈ వరద నీటివల్ల ఎంతోమంది నిరాశ్రయులుగా మారారన్నారు. వారిని ఆదుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. చంద్రబాబు పబ్లిసిటీ కోసం పాకులాడారని గుర్తుచేశారు. ఒకవైపు వరదనీటి ప్రవాహం నుంచి సురక్షిత ప్రాంతాలకు తరలించాలని బాధితులు గగ్గోలు పెడుతున్నా వారిని పట్టించుకోకుండా ఫొటోలకు ఫోజులిచ్చిన వైనం చూసి కళ్లల్లో నీళ్లు తిరిగాయన్నారు. బాధితులకు కనీసం మంచినీళ్లు, ఆహారం అందించలేని అసమర్థ ప్రభుత్వం రాష్ట్రంలో ఉందన్నారు. బాధితులకు పూర్తి స్థాయిలో సహాయక చర్యలు అందక మునుపే విరాళాల రూపంలో దండుకునే పనిలో ఈ ప్రభుత్వం, నాయకులు పడ్డారని ఆరోపించారు. వరదలు వచ్చినప్పుడు తీసుకునే జాగ్రత్తలపై ముందస్తు అవగాహన లేకుండా కేవలం ప్రజల్ని బలిచేయడానికే చంద్రబాబు పన్నాగం పన్నారన్నారు. సహాయక చర్యల్లో హడావుడి చేయడమే తప్ప సీఎం చంద్రబాబు, మంత్రులు ప్రజల్ని ఆదుకునే చర్యలు చేపట్టలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం ప్రచారం పిచ్చితో 50 మంది ప్రాణాలను బలి తీసుకుందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంతో అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఎంతో దూర దృష్టితో విజయవాడలో నిర్మాణం చేసిన రిటైనింగ్ వాల్‌తో ఈ రోజు ఎంతోమంది వరద ప్రమాదం నుంచి బయటపడ్డారని గుర్తుచేశారు. జగన్ తీసుకువచ్చిన ఎండీయూ వాహనాలు వరద బాధితుల్ని ఆదుకునేందుకు ఆసరాగా నిలిచాయన్నారు. ప్రజలను బలిచేసే పబ్లిసిటీ చంద్రబాబుకు అలవాటని, గతంలో ఇదే మాదిరిగా గోదావరి పుష్కరాల సమయంలో 29 మంది ప్రాణాలను పొట్టన పెట్టుకున్నారని ఆరోపించారు. ఈ విషయాలను విజయవాడ వాసులే కాకుండా రాష్ట్రంలో ప్రజలంతా గమనిస్తున్నారన్నారు. వారి మాటలనే తాను చెప్పానన్నారు.

గందరగోళాన్ని తొలగించాలి



మాట్లాడుతున్న డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు హరిప్రసన్న

పొందూరు: రాష్ట్రంలో వచ్చే ఏడాది (2024–25) నిర్వహించే పది పరీక్షల మాధ్యమంపై విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల్లో నెలకొన్న గందరగోళాన్ని రాష్ట్ర ప్రభుత్వం నివృత్తి చేయాలని డీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు పూజారి హరిప్రసన్న కోరారు. బుధవారం మండలంలోని తాడివలసలో ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొని మాట్లాడారు. 2022లో అప్పటి వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో రాష్ట్రంలో 1 నుంచి 10వ తరగతి వరకు సింగిల్ మాధ్యమంలో (ఆంగ్లం) బోధించాలంటూ విద్యాశాఖ 84, 85 జీఓలు జారీ చేసిందన్నారు. 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి జరిగే పదో తరగతి పరీక్షలు ఆగ్లమాధ్యమంలో రాయాలని అప్పట్లో విద్యాశాఖ పేర్కొందన్నారు. ఈ జీఓలు మాతృభాషా మాధ్యమానికి ఆటంకమంటూ జి.శ్రీనివాసరావు, డి.రమేష్ పట్నాయక్‌లు హైకోర్టులో కేసు వేశారని, ఈ కేసు విచారణలో ఉందన్నారు. ప్రస్తుతం రెండు మాధ్యమాల్లో నిర్వహించేందుకు రాష్ట్ర అధికారులు స్పష్టత ఇవ్వకపోవడంతో తీవ్ర గందరగోళం నెలకొందన్నారు. తక్షణమే దీనిపై స్పష్టత ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

గణనాథునికి 21 వంటకాల నైవేద్యం



నైవేద్యంగా సమర్పించిన వంటకాలు

నరసన్నపేట: వినాయక నవరాత్రి ఉత్సవాల సందర్భంగా నరసన్నపేట మండలం రెడ్డికిపేటలో బొజ్జ గణపయ్యకు 21 రకాల ఆహార పదార్థాలతో నైవేద్యం సమర్పించారు. సర్పంచ్ అప్ప రవీంద్ర ఆధ్వర్యంలో గ్రామ మహిళలు విభిన్న వంటకాలు సిద్ధం చేసి మేళతాళాల నడుమ మండపం వద్దకు తీసుకొచ్చారు.

భక్తిశ్రద్ధలతో లక్ష్మీగణపతి హోమం



ఆమదాలవలస: ఆమదాలవలస పట్టణంలోని బీఆర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వరసిద్ధి వినాయక పంచమ రాత్రి ఉత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి మండపం వద్ద లక్ష్మీ గణపతి హోమాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పురోహితులు రాజేష్ శర్మ ఆధ్వర్యంలో హోమ చేపట్టారు. కమిటీ సభ్యులు, భక్తులు పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

15 లోగా పంట నమోదు చేసుకోవాలి

మెళియాపుట్టి: ఈ నెల 15వ తేదీ లోగా పంట నమోదును ప్రతీ రైతు విధిగా పూర్తి చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి ధానకర్జుడు బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పంట నమోదు చేసుకుంటేనే బీమా సౌకర్యం, పరిహారాలు, మద్దతు ధర లభిస్తాయన్నారు.

పరామర్శ..



సారవకోట: వైస్ ఎంపీపీ రామారావు కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న ధర్మాన కృష్ణదాస్



హిరమండలం: గోవిందరావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మామిడి శ్రీకాంత్

సారవకోట: స్థానిక వైస్ ఎంపీపీ గుణుపురం రామారావు తల్లి ఎండమ్మ మృతి చెందారు. ఆ కుటుంబాన్ని కుటుంబాన్ని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు ధర్మాన కృష్ణదాస్ బుధవారం పరామర్శించారు. గొర్రిబంద గ్రామానికి చెందిన ఆనందరావు తల్లి మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని, చిన్నకిట్టాలపాడు పంచాయతీ వెంకంపేట గ్రామానికి చెందిన కిట్టాలపాడు పోలయ్య మృతి చెందడంతో ఆ కుటుంబసభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలియజేశారు. పరామర్శించిన వారిలో పార్టీ మండల కమిటీ అధ్యక్షుడు వరుదు వంశీకృష్ణ, డీఎల్‌డీఏ చైర్మన్ నక్క తులసీదాస్, సర్పంచ్‌లు కోరుకొండ శంకరరాబు, సాగిపల్లి దండాశి, కొండాల బాబూరావు, పార్టీ నాయకులు గెల్లంకి వెంకటరావు, యాళ్ల శ్యామసుందరరావు, పల్లి కృష్ణారావు, నిక్కు కృష్ణారావు, బోర శ్రీరామమూర్తి, కోరాడ అప్పయ్య, గొర్లె ఢిల్లీరావు, పారశెల్లి తేజేశ్వరరావు తదితరులు ఉన్నారు.

హిరమండలం: మండలంలోని రుగడ ఎంపీటీసీ సభ్యురాలు కరణం ప్రియాంక తండ్రి కరణం గోవిందరావు మంగళవారం మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర తూర్పు కాపు విభాగం అధ్యక్షుడు మామిడి శ్రీకాంత్ బుధవారం అవలంగి గ్రామానికి వెళ్లి గోవిందరావు కుటుంబాన్ని పరామర్శించారు. పరామర్శించిన వారిలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు లోలుగు లక్ష్మణరావు, పార్టీ నాయకుడు బి.శ్రీనివాసరావు ఉన్నారు.

కొత్తూరు: మండలంలోని ఇరపాడు గ్రామానికి చెందిన సొంట్యాన లక్ష్మణరావు భార్య రాజ్యలక్ష్మి, బిల్లశోంటి అనాథరావు ఇటీవల మృతి చెందారు. ఆ కుటుంబాలను తూర్పుకాపు కార్పొరేషన్ చైర్మన్ మామిడి శ్రీకాంత్, టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణ, వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి బూర్లె శ్రీనివాసరావు, ఏఎంసీ మాజీ చైర్మన్ గోగుల మాధవి వరప్రసాదరావు నాయుడు, తమ్మినాయుడు, పి.శేషగిరి, రామారావు నాయుడు, వై.గోవిందరావు, పి.గోవిందరావు బుధవారం పరామర్శించారు.

ఎన్‌ఓసీ లేకుండా పనులు ఎలా చేస్తారు?



సరుబుజ్జిలి: పెట్రోల్ బంకు స్థల రికార్డులను పరిశీలిస్తున్న అధికారులు

సరుబుజ్జిలి: పెట్రోల్ బంకు నిర్మాణానికి సంబంధించి ఎన్‌ఓసీ లేకుండా పనులు ఎలా ప్రారంభించారని యాజమాన్యాన్ని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫరూక్ అహమ్మద్ ప్రశ్నించారు. వెంటనే నోటీసులు జారీచేయాలని అధికారులను ఆదేశించారు. బప్పడాం పంచాయతీ పరిధిలోని అలికాం–బత్తిలి రహదారిని ఆనుకుని జరుగుతున్న బంకు నిర్మాణ స్థలాన్ని బుధవారం పరిశీలించారు. అన్నిశాఖల నుంచి నిరభ్యంతర ధృవపత్రం లేకుండా పనులు ఎలా కొనసాగిస్తున్నారని జేసీ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇదే విషయం తహసీల్దార్ మధుసూదన్‌వద్ద ప్రస్తావించగా.. జేసీ ఆదేశాల మేరకు నిర్మాణాలు నిలుపుదల చేసి, పెట్రోల్ బంకు యజమానికి నోటీసులు జారీ చేస్తామని వెల్లడించారు. ఈ పరిశీలనలో డీఎస్ఓ బగాది శాంతిశ్రీ, డీఎంహెచ్ఓ బొడ్డేపల్లి మీనాక్షి, ఆర్ఐ బాబూరావు, విజిలెన్స్ అధికారులు పాల్గొన్నారు.

స్థల పరిశీలన..

జలుమూరు: మండల కేంద్రంలో భారత్ పెట్రోల్ బంక్ ఏర్పాటుకు స్థలాన్ని పరిశీలించి అనుమతులు ఇవ్వనున్నామని జేసీ ఫర్మాన్ అహమ్మద్ ఖాన్ అన్నారు. బుధవారం స్థలాన్ని పరిశీలించి నిబంధనలు ప్రకారం పూర్తిస్థాయి అవసరమైన వివిధ శాఖల అనుమతి పత్రాలను పరిశీలించారు. జిల్లా పౌరసరఫరాల అధికారి బి.శాంతిశ్రీ, తహసీల్దార్ జి.లక్ష్మీనారాయణ, ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు, అగ్నిమాపక అధికారులు, డీటీ శ్రీనివాసరావు, సర్వేయర్ నాగేశ్వరరావు, ఆర్ఐ సతీష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనల ప్రకారమే అనుమతులు

ఎల్.ఎన్.పేట: ప్రభుత్వ నిబంధనల ప్రకారమే అనుమతులు ఇవ్వటం జరుగుతుందని జిల్లా జాయింట్ కలెక్టర్ ఫారుక్ అహమ్మద్ ఖాన్ అన్నారు. మండలంలోని రావిచంద్రి వద్ద అలికాం – బత్తిలి రోడ్డు పక్కన పెట్రోల్ బంకు నిర్మాణానికి బుధవారం స్థలాన్ని పరిశీలించారు. తహసీల్దార్ వై.వి.పద్మావతి, మండల సర్వేయర్ రెడ్డి గవరయ్యలను సర్వే నంబర్, విస్తీర్ణం తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. టెక్కలి ఆర్డీఓ సుదర్శన్ దొర, రెవెన్యూ ఉద్యోగులు, సర్వే సిబ్బంది పాల్గొన్నారు.

ఎరువుల కొరతపై ఆందోళన



ఎరువుల కోసం అధికారులను నిలదీస్తున్న ఎంపీటీసీలు, సర్పంచ్‌లు

పాతపట్నం: మండలంలోని రైతులకు యూరియా, డీఏపీ, పోటాష్ తదితర ఎరువులు అందుబాటులో లేవని, ఎరువుల కోసం రైతులు ఇబ్బంది పడుతున్నారని, ప్రభుత్వ పెద్దలు, అధికారులు పట్టించుకోవడం లేదని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు నిలదీశారు. మండల ప్రజాపరిషత్ కార్యాలయం సమావేశ మందిరంలో ఎంపీపీ దొర సావిత్రమ్మ అధ్యక్షతన బుధవారం మండల సమావేశం నిర్వహించారు. మండలానికి సరిపడే ఎరువులు లేవని, పోటాష్, పురుగు మందులు, టార్పాలిన్‌లు ఈ ప్రభుత్వం కూడా రైతులకు అందించేదన్నారు. మండలోని 50 శాతం మంది రైతులు ఎరువుల కోసం ఒడిశా రాష్ట్రంలో ఎక్కువ రేటుకు కొనుగోలు చేయాల్సి వస్తుందని సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. ఏఓ బి.రవికుమార్ మాట్లాడుతూ మండలానికి 18,112 యూరియా బస్తాలు ఇండెంట్(200 మెట్రిక్ టన్నులు) పంపామన్నారు. ఎంపీడీఓ జయంత్ ప్రసాద్ మాట్లాడుతూ మరో రెండు రోజుల్లో 200 మెట్రిక్ టన్నుల యూరియా, డీఏపీ వస్తుందన్నారు. సమావేశం జరుగుతుండగా ఎంపీడీఓ కార్యాలయంలో టైపిస్ట్‌గా పనిచేస్తున్న తేజోమూర్తుల ప్రదీప్ అనారోగ్యంతో మృతి చెందాడని ఎంపీడీఓ తెలియజేయడంతో నిలిపివేశారు. జెడ్పీటీసీ లింగాల ఉషారాణి, అధికారులు రెండు నిమిషాలు మౌనం పాటించారు. మండల సలహాదారుడు ఎం.గణపతిరావు, తహసీల్దార్ కిరణ్ కుమార్, సీడీపీఓ విమలారాణి, సీహెచ్‌సీ సూపరింటెండెంట్ కృష్ణారావు, వైద్యులు సదాశివ, శివకుమార్, ఆర్‌డబ్ల్యూస్ జేఈ కల్యాణ్, ఏపీఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

విరాళాల సేకరణ

మెళియాపుట్టి: విజయవాడ వరద బాధితుల సహాయార్థం మండల కేంద్రంలోని నలంద పబ్లిక్ స్కూల్ విద్యార్థులు బుధవారం విరాళాలు సేకరించారు. వరదల వల్ల నిరాశ్రయులైన ఎంతో మంది అభాగ్యులకు అండగా ఉండేందుకు ప్రతిఒక్కరూ ముందుకు రావాలని ప్రిన్సిపాల్ ప్రతాప్ కోరారు. ఉపాధ్యాయులు హరనాథ్, మురళీమోహన్ పాత్రో, ధర్మారావు, శారద పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

ఆమదాలవలస: మండలంలోని గాజులకొల్లివలస 33/11కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ మునగవలస, గాజులకొల్లివలస ఫీడర్ల పరిధిలో శుక్రవారం చెట్ల కొమ్మలు తొలగించటం, విద్యుత్ లైన్ మరమ్మతులు నిర్వహించనున్నారు. ఎలక్ట్రికల్ ఈఈ బయ్యన్నాయుడు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు గాజులకొల్లివలస, చిన్నజొన్నవలస, పెద్దజొన్నవలస, మునగవలస, రాధాకృష్ణాపురం, రామచంద్రాపురం, పొన్నంపేట, చిట్టివలస, సైలాడ, కుమ్మరిపేట, చవ్వాకులపేట, అక్కులపేట, తాళ్లవలస, మండాది తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

- పట్టణంలోని పార్వతీశంపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధి 11 కేవీ కృష్ణాపురం ఫీడర్‌లో శుక్రవారం విద్యుత్ నిర్వహణ పనులు చేపట్టనున్నారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పట్టణ పరిధిలోని పార్వతీశంపేట, కృష్ణాపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, కోర్టు, మున్సిపల్ కార్యాలయం, చంద్రయ్యపేట తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందన్నారు.

కొత్తూరు మండలంలో..

కొత్తూరు: ఈ నెల 13 తేదీన మండలంలోని నివగాం విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనున్నారు. ఈ మేరకు విద్యుత్ శాఖ టెక్కలి డివిజన్ ఈఈ శంకరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కౌశాల్యాపురం, బలద, కడుము, హంస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామన్నారు.

ఇసుక ర్యాంపుపై ప్రజాభిప్రాయ సేకరణ

నరసన్నపేట: ఇసుక ర్యాంపు అవసరమే..అయినా ముందుగా తమ గ్రామ సమస్యలు పరిష్కరించండి అని నరసన్నపేట మండలంలోని ఉప్పరిపేట గ్రామస్తులు అధికారులను కోరారు. బుధవారం ఉప్పరిపేటలో ఇసుక రీచ్ నిర్వహణపై ఏపీ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. దీంట్లో పాల్గొన్న గ్రామస్తులు గుర్రం రాజేష్, నాగేని సూరన్నాయుడు, దుల్ల ఆనంద్, రుప్ప అప్పన్న, రామారాజు, రౌతు రాము, రౌతు నాయుడు మాట్లాడుతూ రోడ్డును అభివృద్ధి చేయాలని, గ్రామస్తులకు ఉపాధి కల్పించాలని, గ్రామానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని, గ్రామస్తులకు ఉచితంగా ఇసుక ఇవ్వాలని కోరారు. కాలుష్య నియంత్రణ మండలి ఈఈ రామారావు నాయుడు ఆధ్వర్యంలో గ్రామ సభ నిర్వహించారు. సర్వే నంబర్ ఒకటిలో వంశధార నదిలో 2.30 హెక్టార్లలో 23 వేల క్యూబిక్ మీటర్ల ఇసుక తవ్వకాలకు ఉప్పరిపేటలో ఇసుక రీచ్‌ను ప్రభుత్వం మంజూరు చేసిందని, దీనిపై ప్రజల అభిప్రాయాలను సేకరిస్తున్నామని రామారావు నాయుడు తెలిపారు. గ్రామస్తులు సహకరించాలని కోరారు. ఈ సమావేశంలో ఆర్డీఓ రంగయ్య, తహసీల్దార్ సత్యనారాయణ, ఆర్ఐ లోకేష్, మైన్స్ అధికారులు పాల్గొన్నారు.

పేద విద్యార్థి చదువుకు చేయూత

పాతపట్నం: మండల కేంద్రంలోని హరిజన వీధికి చెందిన శిర్ల మహేష్‌కు ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. వీరిది పేద కుటుంబం కావడంతో ఆర్థికంగా ఇబ్బంది పడకూడదని పాతపట్నంకు చెందిన అబ్దుల్ కలాం సేవా ఫౌండేషన్ సభ్యులు రూ.15 వేలను బుధవారం అందజేశారు. ఎమ్మార్సీ వద్ద మహేష్ తండ్రి శిర్ల జానీకి ఎంఈఓ బి.శ్రీధర్ ఆధ్వర్యంలో నగదు అందించారు. సభ్యులు పాడి, చలపతి, శంకరరావు, వైకుంఠరావు, శ్రీనువాసరావు, అప్పలస్వామి, సీఆర్పీలు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పును పునఃసమీక్షించాలి

కొత్తూరు: ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును పునఃసమీక్షించాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట సమితి మండల ప్రధాన కార్యదర్శి పడాల నాగభూషణరావు కోరారు. ఢిల్లీలో జాతీయ స్థాయిలో జరుగుతున్న మహా ధర్నాకు సంఘీభావంగా బుధవారం కొత్తూరు నాలుగు రోడ్ల కూడలి వద్ద నిరసన చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహానికి పూల మాలవేశారు. ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధమన్నారు. ఈ తీర్పు వల్ల ఎస్సీల్లో ఐక్యత దెబ్బతింటుందని ఆందోళన వ్యక్తం చేశారు. పాలకులు కుట్రలో భాగమే ఈ తీర్పు అని ఆరోపించారు. మండల నాయకులు వడమ శ్రీనివాసరావు, బొడ్డేపల్లి కృష్ణారావు, రామకృష్ణ, డి.జమ్మయ్య, జి.రామారావు, విశాఖ సూరిబాబు, మంతిన త్రినాథరావు, రాంబాబు, జి.సింహాచలం పాల్గొన్నారు.

నిత్యావసరాలు అందజేత



నిత్యావసరాలు అందిస్తున్న రాజశేఖర్ రెడ్డి

మెళియాపుట్టి: ఇటీవల వర్షాలకు మండలంలోని గంగరాజపురం గ్రామంలోని అర్జున్ బిస్వాల్‌కు చెందిన ఇంటి గోడ కూలింది. ఆ కుటుంబానికి బుధవారం పాతపట్నం మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అనపాన రాజశేఖర రెడ్డి నిత్యావసర సరుకులు, బియ్యం, కొంత నగదు అందించారు. వట్టికుళ్ల చక్రి, పరమేష్ తదితరులు ఉన్నారు.

నిర్మాణ పనులు అడ్డగింత

మెళియాపుట్టి: మండల కేంద్రంలోని మెయిన్ రోడ్డు పరిసర ప్రాంతంలో బుధవారం ఓ స్థలంలో పునాది తవ్వుతున్న సమయంలో.. స్థానిక వీఆర్వో కోటేశ్వరరావు పనులను నిలిపివేశారు. ఇది ప్రభుత్వ స్థలమని, ఫేక్ పట్టా అని తెలిసిన సమాచారం మేరకు స్థలాన్ని పరిశీలించి పనులను అడ్డుకున్నట్లు వీఆర్వో తెలిపారు. దీనిపై తహసీల్దార్ హనుమంతరావును వివరణ కోరగా.. విచారణ చేపట్టి పూర్తివివరాలు తెలియజేస్తామన్నారు.

జీఓ 85ను రద్దు చేయాలి

సారవకోట: మండలంలోని సారవకోట, బొంతు పీహెచ్‌సీల వైద్యులు బుధవారం నల్ల బ్యాడ్జ్‌లు ధరించి విధులు నిర్వర్తించారు. జీఓ నంబర్ 85 ను రద్దు చేయాలని కోరుతూ యూనియన్ ఇచ్చిన పిలుపుమేరకు తాము నల్ల బ్యాడ్జ్‌లు ధరించి విధులు నిర్వర్తిస్తున్నామన్నారు.

హిరమండలం: జీఓ నంబర్ 85ను రద్దుచేయాలని హిరమండలం పీహెచ్‌సీ వైద్యాధికారి సి.హెచ్.సాయిగీత డిమాండ్ చేశారు. పీహెచ్‌సీ ఎదుట నల్ల బ్యాడ్జీలతో వైద్య సిబ్బందితో కలిసి నిరసన వ్యక్తం చేశారు. ఈ నెల 14నుంచి అత్యవసర వైద్య సేవలు మాత్రమే అందిస్తామన్నారు. 15న చలో విజయవాడ, 16న నిరవధిక నిరహారదీక్షలు చేపడతామన్నారు.

పొందూరు: రాష్ట్రంలో పీజీ వైద్య విద్యలో ఇన్ సర్వీస్ కోటాను కుదిస్తూ తీసుకు వచ్చిన జీఓ 85ను ప్రభుత్వ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యుల సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ జి.రమేష్‌నాయుడు డిమాండ్ చేశారు. మండలంలోని రాపాక, పొందూరు, కృష్ణాపురం గ్రామాల్లో బుధవారం నిర్వహించిన వైద్య శిబిరాల్లో నల్ల బ్యాడ్జీ ధరించి విధుల్లో పాల్గొని నిరసన తెలియజేశారు. వైద్యులు శివశంకర్, నవీన్, నాగపవన్ తదితరులు పాల్గొన్నారు.

పాడి రైతులకు అందుబాటులో ఉండాలి



మాట్లాడుతున్న జేడీ మురళీధర్

పాతపట్నం: పాడి రైతులకు పశుసంవర్ధకశాఖ ఉద్యోగులు అందుబాటులో ఉండాలని జిల్లా పశుసంవర్ధకశాఖ సంయుక్త సంచాలకులు డాక్టర్ రావుపల్లి మురళీధర్ ఆదేశించారు. స్థానిక పశుసంవర్ధకశాఖ ప్రాంతీయ కార్యాలయంలో బుధవారం పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పశువైద్యులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు, పీపీఆర్ టీకాలు వేయడంలో ప్రతి ఒక్కరూ లక్ష్యాలను సాధించాలన్నారు. కిసాన్ క్రెడిట్ కార్డు ద్వారా పాడి రైతులకు రుణ సదుపాయం కల్పించాలన్నారు. మేలు జాతి ఆడదూడల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలన్నారు. పశువులు, గొర్రెలు, మేకలు, కోళ్ల షెడ్లు అవసరం ఉన్న వారిని మాత్రమే ఎంపిక చేయాలన్నారు. పాతపట్నం సహాయ సంచాలకులు మంచు కరుణాకరరావు, పశువైద్యులు బి.శ్రీవాణి, పి.అనిల్‌కుమార్, కె.మౌనిక, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.